నేటి దినపత్రిక
# సూర్య
18 వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
శనివారం | 30 నవంబర్ 2024 | పేజీలు 8

వైసీపీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో

## అప్పుల ఊబిలో ఆర్టీసీ

ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి

2లో



రైతుల విషయంలో రాజకీయాలు చేస్తే..

## దేవుడు కూడా క్షమించరు




**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** వైసీపీ హయాంలో పనులను ప్యాకేజీలుగా మార్చి భోంచేశారు.. ఇప్పుడు రైతుల పర్యవేక్షణలో పారదర్శకంగా పనులు జరుగుతుంటే, అడ్డగోలు మాటలతో అక్కసు వెళ్లగక్కుతున్నారు.. ఐదేళ్ల తర్వాత కాలువలు బాగుపడుతుంటే అంత బాధ ఎందుకో ! అప్పట్లో లస్కర్లకు జీతాలు ఇప్పించలేని వాళ్లు ఇప్పుడు పారదర్శకంగా జరుగుతున్న పనులపై పిటీషన్లు పెట్టుకుంటూ గడిపేస్తున్నారని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వెంకటాచలం మండలం చెముడుగుంట వద్ద పూడిక తీసిన సాగునీటి కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలువలకు ఐదేళ్ల తర్వాత మళ్లీ పూర్వ వైభవం వచ్చిందని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. సర్వేపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా సాగునీటి కాలువల్లో పూడికతీతకు సుమారు రూ.6 కోట్లకు పైగా నిధులతో 86 పనులు మంజూరు చేయించామన్నారు. ఒక్కో పని రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఉంటుందన్నారు. ప్రతి పనిని కూడా పెద్ద కాంట్రాక్టర్లు కాకుండా ఏ ఊరికి ఆ ఊరి రైతులు సొంతంగా పర్యవేక్షించి కాలువలను బాగు చేసుకున్నారన్నారు. సోషల్ మీడియాలో నిత్యం చిలక పలుకులు పలికే పెద్దమనిషి హయాంలో ఎన్నికలకు 4 నెలల ముందు రూ.30 కోట్ల విలువైన పనులను ఆరు ప్యాకేజీలుగా చూపారని, -మిగతా 2లో

రైతులను కలవరపెడుతున్న

# ఫెంగల్



- వివిధ దశల్లో వరి నారుమళ్లు
- పూత దశలో ఉద్యాన పంటలు
- మరోపక్క వాన కోసం ఎదురు చూస్తున్న రైతాంగం
- రైతులకు సగం మోదం.. సగం ఖేదం !

**రాపూరు, మేజర్‌న్యూస్ :**

బంగాళాఖాతంలో ఏర్పడ్డ ఫెంగల్ తుఫాన్ వరి రైతులను కలవరపెడుతోంది. ఈ ఏడాది వానల్లేక మండలంలో చాలా వరకు గ్రామాల్లో సేద్యం మానేశారు. తెలుగు గంగ నీటి పారుదల అవకాశం ఉన్న జోరేపల్లి, మునగాల వెంకటాపురం, మరి కొన్ని గ్రామాల్లో బోర్ల కింద వరి సాగు చేస్తున్నారు. ఇప్పుడు అందరూ వరి నారుమళ్లు పోసుకొని ఉన్నారు. నారుమళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. అయితే రెండు రోజులు ముందు విత్తిన నారుమళ్లు మొలక తీసే దశలో ఉండటంతో రెండు రోజులు నీరు నిల్వ ఉంటే, మొలక మురిగిపోయే ప్రమాదం ఉండటంతో ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా మెట్ట ప్రాంతమైన రాపూరు నిమ్మ, ప్రత్తి, మిరప లాంటి పంటలు విరివిగా సాగు చేస్తున్నారు. ఈ వానకి పూత దెబ్బతినే అవకాశం ఉండటంతో రైతుల్లో బెంగ మొదలైంది. మరోపక్క నవంబరు నెల దాటిపోతున్నా 95 శాతం చెరువులు ఖాళీగానే ఉన్నాయి. ఈ నెలలో సాధారణ వర్షపాతం 306.9 మిల్లీ మీటర్లు కాగా, ఇప్పటి వరకు కేవలం 14 మిల్లీ మీటర్లు మాత్రమే కురవడం.. ఈ తుఫాన్‌తోనైనా చెరువులు నిండకపోతాయా ! అని కొందరు రైతులు -మిగతా 2లో



మొలక వచ్చే దశలో ఉన్న వారి నారుమడి

డిసెంబర్ 7న అన్ని పాఠశాలల్లో..

## మెగా పేరెంట్ టీచర్ మీటింగ్



2లో

- ఉత్సవ వాతావరణంలో నిర్వహించాలి
- పాఠశాలలో సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేయాలి
- తల్లిదండ్రులకు పాఠశాలలతో అనుబంధం పెరగాలి

జిల్లా కలెక్టర్ ఆనంద్

పచ్చదనాన్ని పెంచేందుకు

## చర్యలు తీసుకోండి

కమిషనర్ సూర్యతేజ



2లో

# వైసీపీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో అప్పుల ఊబిలో ఆర్టీసీ

## ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా చేసిన పాలనంతా తూతూ మంత్రంగా సాగించాడని, అప్పట్లో అభివృద్ధి జరిగిందంటే కేవలం కేంద్ర ప్రభుత్వ పథకాలు మాత్రమే ప్రజలకు అందాయని ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక డీఆర్ ఉత్తమ హెూటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరి మాట వినకుండా, ఆర్టీసీని ఏవిధమైన అభివృద్ధి పరచకుండా, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించకుండా, నియంత్రత్వ పాలన కొనసాగించిన గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేసిందని ఆయన ఆరోపించారు. గ్రామీణ ప్రాంతాల్లో కనీసం బస్సులు కూడా వెళ్లలేని దయనీయమైన స్థితికి రోడ్లను తీసుకొచ్చారని ఆయన విమర్శించారు. తాను ఆర్టీసీ చైర్మన్‌గా ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ అభివృద్ధికి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వద్ద నుండి నెల్లూరు జిల్లాలోని మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, నారాయణలతో పాటు ఎమ్మెల్యేలతో కలసి అభివృద్ధిపరిచేందుకు తనవంతు కృషి చేస్తానని తెలియజేశారు. రిటైర్డ్ ఉద్యోగుల అవస్థలు వర్ణనా తీతమని, అన్ని శాఖలలో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులు లాగానే, ఆర్టీసీలో పనిచేసి రిటైర్డ్ ఏ సమయానికి వారికి రావలసిన ప్రాఫిట్స్, పెన్షన్ సమయానికి రాక సంవత్సరాలపాటు కార్యాలయాల చుట్టూ తిరగటం జరిగిందన్నారు. ఇకముందు అలా లేకుండా వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని తెలిపారు. ఇప్పటికిప్పుడే అన్ని చేసేస్తానని నేను చెప్పలేనన్నారు. క్రమేణ ఆర్టీసీని అభివృద్ధి పథంలో నడిపించి ప్రజలకు మెరుగైన రవాణా వ్యవస్థను కల్పించడమే లక్ష్యంగా పని చేస్తానని ఆయన అన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు వంశీధర్ రెడ్డి, నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్, జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు ముక్కు రాధాకృష్ణ గౌడ్, గిరి కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నగరవ్యాప్తంగా పచ్చదనాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోండి : కమిషనర్ సూర్యతేజ



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నగరవ్యాప్తంగా డివైడర్లలో పచ్చదనాన్ని పెంచి ఆహ్లాదకరమైన వాతావరణం పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ అధికారులను ఆదేశించారు. స్థానిక రంగనాయకుల పేట పినాకిని పార్కును కమిషనర్ శుక్రవారం పరిశీలించారు. పార్కుకు అనుసంధానంగా ఉన్న పది అడుగుల అప్రోచ్ రోడ్డును విస్తరించి 30 అడుగుల రోడ్డు నిర్మాణం చేపట్టాలని, రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటి గార్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం స్థానిక సాలు చింతల ప్రాంతంలోని కరకట్ట ప్రదేశంలో వాకింగ్ ట్రాక్ నిర్మాణం, ఫుడ్ కోర్టు ఏర్పాటుకు అనుకూలతలను పరిశీలించి అధికారులతో చర్చించారు. నిర్మాణాలకు అవసరమైన ప్రతిపాదనను సిద్ధం చేసి పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. అనంతరం స్థానిక మినీ బైపాస్ నుడా ఎన్టీఆర్ పార్కును కమిషనర్ సందర్శించారు. మినీ బైపాస్‌తో పాటు అన్ని ప్రాంతాల్లోని డివైడర్లలో పచ్చదనాన్ని పరిరక్షించేందుకు అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, క్రమం తప్పకుండా మొక్కలను, వాటి రక్షణను పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. అవసరమైన అన్ని ప్రాంతాల్లోని డివైడర్లకు నూతన రంగులు వేయాలని, రోడ్లపై అవసరమైన చోట గుంతలను పూడ్చే పనులను వెంటనే చేపట్టాలని అధికారులు కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ రామమోహనరావు, ఈఈ రహంతూజాని, డీసీపీ పద్మజ, ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రదీప్ కుమార్, ఇంజనీరింగ్ విభాగం డీఈఈ రఘురాం, సర్వేయర్ సోమేశ్వరరావు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల విషయంలో రాజకీయాలు చేస్తే..

# దేవుడు కూడా క్షమించరు



(మొదటి పేజీ తరువాయి)

ఆ ప్యాకేజీల్లోని పనులను కూడా చేయకుండానే బిల్లులు చేసేసుకున్నారు. ఇప్పుడు రైతులు పారదర్శకంగా పనులు చేసుకుంటుంటే అక్కసుతో సిగ్గు, శరం లేకుండా నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారన్నారు. నిత్యం విమర్శలు చేసే పెద్దమనిషి రాత్రి అన్నం తిని పడుకున్నాకైనా.. గుండెలపై చేతులు వేసుకుని ఏం చేస్తున్నామని ఆలోచించుకోరా అని ప్రశ్నించారు. వైసీపీ హయాంలో తాము దోపిడీకి పాల్పడితే, ఇప్పుడు టీడీపీ హయాంలో పక్కాగా రైతులే పనులు చేసుకుంటున్నారే, అప్పట్లో తాము చేసింది చాలా పెద్ద పొరపాటని కొంచెమైన సిగ్గు పడరా అన్నారు. మృగాల కన్నా దారుణంగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. అప్పుడేమో అడ్డంగా దోపిడీకి పాల్పడి రైతుల నోళ్లు కొట్టారన్నారు. ఇప్పుడు రైతులు చేసుకుంటున్న పనులపై రోజూ పిటీషన్లు పెట్టడమే పనిగా పెట్టుకున్నారన్నారు. పూడిక తీయని కాలువలకు నీళ్లు వదిలి గత ఏడాది రెండో పంట సమయంలో 30 టీఎంసీల నీటిని బురదలో కలిపేశారన్నారు. సాగునీటి పారుదలలో కీలకమైన లస్కర్లకు జీతాలు కూడా ఇప్పించలేకపోయినోళ్లు ఇప్పుడు ఏదేదో మాట్లాడుతున్నారన్నారు. మొదటి పంటలో 3 లక్షల ఎకరాల్లో పంట లేకుండా చేశారని, కొంచెమైనా మానవత్వం లేకుండా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. అడ్డగోలుగా మాట్లాడుతున్న వైసీపీ నాయకులు ఊళ్లలోకి రైతుల మధ్యలోకి వెళ్లండి.. ఎవరి హయాంలో కాలువలో బాగుపడ్డాయో తెలుసుకోండన్నారు. అన్నం పెట్టే రైతుల విషయంలో దుర్మార్గంగా వ్యవహరిస్తే ప్రజలే కాదు దేవుడు కూడా క్షమించరని గుర్తుంచుకోవాలన్నారు.

## రైతులను కలవర పెడుతున్న 'ఫెంగల్'

(మొదటి పేజీ తరువాయి)

ఎదురు చూస్తున్నారు. మొత్తంగా ఫెంగల్.. ఏం చేసిపోతుందో చూడాలి మరి. తుఫాన్‌కి రైతులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలని 'మేజర్‌న్యూస్' మండల వ్యవసాయ అధికారి సోమసుందర్‌ని వివరణ కోరగా.. రైతులు తమ పొలాల్లో మెరుగైన నీటి పారుదల వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలన్నారు. వర్షపు నీరు నిలవ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తుఫాను ప్రభావం ఎక్కువగా ఉండి నారుమళ్లు చెడిపోతే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సబ్సిడీలో విత్తనాలు అందించడం చేస్తామన్నారు.

# డిసెంబర్ 7న అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్

- **ఉత్సవ వాతావరణంలో నిర్వహించాలి**
- **పాఠశాలలో సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేయాలి**
- **తల్లిదండ్రులకు పాఠశాలలతో అనుబంధం పెరగాలి**
- **జిల్లా కలెక్టర్ ఆనంద్**

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** పిల్లల బంగారు భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు పాఠశాలల వైపు అడుగులు వేసేందుకు డిసెంబర్ 7న మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌ను ఉత్సవ వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయవలసిందిగా జిల్లా కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా వచ్చే నెల 7న పెద్ద ఎత్తున నిర్వహించే తల్లిదండ్రుల-ఉపాధ్యాయుల సమావేశానికి సంబంధించి జిల్లాలో నిర్వహించేందుకు ఏర్పాట్లు గురించి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కలెక్టర్ ఛాంబర్‌లో శుక్రవారం సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రతి పాఠశాలలో డిసెంబర్ 7న తల్లిదండ్రుల-ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించాలన్నారు. అభ్యాసన వ్యవస్థలో తల్లిదండ్రుల-ఉపాధ్యాయుల సమావేశాలు కూడా ముఖ్యమైన భాగమని, పిల్లలకు గల బలాలు, బలహీనతలపై చర్చించుకోవడానికి, తద్వారా వారి ఎదుగుదలకు ఎంతగానో సహాయ పడుతాయన్నారు. అంతేకాకుండా పాఠశాలల అవసరాలను తల్లిదండ్రుల దృష్టి కోణంలో గుర్తించటానికి అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలోని జనాభాలో దాదాపు 5వ వంతు మంది హాజరయ్యే ఈ సమావేశాలకు అందుకు తగ్గట్టుగా అన్ని ఏర్పాట్లు చేయవలసిందిగా అధికారులకు సూచించారు. జిల్లాలోని అన్ని స్థాయిల్లోని ప్రజా ప్రతినిధులు వివిధ పాఠశాలలకు హాజరయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అన్ని పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడానికి ఈఓపీఆర్‌డీలు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలను అందంగా అలంకరించాలన్నారు. ఇందుకు తగిన నిధులను అందజేస్తామన్నారు. ఆయా పాఠశాలల్లో చదివిన పూర్వ విద్యార్థులను ఆహ్వానించి, వారి ఉపన్యాసాల ద్వారా పిల్లల్లో ప్రేరణ కలిగించే విధంగా చూడాలన్నారు. అలాగే తల్లిదండ్రుల్లోని మహిళలకు ముగ్గుల పోటీలు, పురుషులకు టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించాలన్నారు. సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా తల్లిదండ్రులను ఆహ్వానించడానికి పిల్లలతోనే ఆహ్వాన నోటీసులను తయారు చేయించాలని, ఇందుకు అవసరమైన కార్డులు, కలర్ పెన్సిళ్లు, స్కెచ్ పెన్సు తదితర వస్తువులను విద్యార్థులకు ముందుగానే అందజేయాలన్నారు. పిల్లలతో చేయించే ఈ ఆహ్వాన నోటీసు తయారీను జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఒకే రోజున, ఒకే సమయంలో నిర్వహిస్తే బాగుంటుందన్నారు. వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల పిల్లల తల్లిదండ్రులను ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఆహ్వానించాలని సంక్షేమ అధికారులకు సూచించారు. దాంతోపాటు ఉపాధ్యాయులు సైతం మెసేజ్, ఫోన్ కాల్ ద్వారా ఆయా తల్లిదండ్రులను ఆహ్వానించాలన్నారు. వివిధ శాఖల అధికారులతో కూడిన కమిటీలను వెంటనే ఏర్పాటు చేసి, ఆయా వివరాలను సంబంధిత వెబ్ సైట్‌లో నమోదు చేయాలన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా కలెక్టరేట్లో సంబంధిత శాఖల సిబ్బందితో ఆరోజు ఉదయం 6 నుండి సాయంత్రం 6 వరకు పనిచేసే విధంగా ప్రత్యేక కంట్రోల్ రూమ్ సైతం ఏర్పాటు చేయాలన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరవుతారని, కనుక ప్రతి మండలస్థాయి అధికారి, ఇతర అధికారులు పాఠశాల కమిటీలు ఆయా పాఠశాలల్లో జరిగే సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ఆ రోజు పాఠశాలలో సహపంక్తి భోజనం ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డీఆర్వో ఉదయభాస్కర్ రావు, డీఈవో బాలాజీ రావు, సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి, సోషల్ వెల్ఫేర్ డీడీ శ్రీనివాసులు, జెడ్పీ డిప్యూటీ సీఈఓ మోహన్ రావు, డీఎంహెచ్ఓ డా. పెంచలయ్య, ఐటీడీఏ పీఓ పరిమళ, బీసీ వెల్ఫేర్ ఇంచార్జి అధికారి ప్రసూన, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో పొంచి ఉన్న ప్రమాదం

**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** బుచ్చిరెడ్డిపాలెం మండలంలో విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఎక్కడ చూసినా ట్రాన్స్ఫార్మర్లు దగ్గర, విద్యుత్తు స్తంభాలు చెట్లులా దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రజలు, పశువుల కాపరులు భయాందోళన చెందుతున్నారు. రేపు ఏదైనా ప్రమాదం సంభవించి ప్రాణ నష్టం జరిగితే ఎవరు వాటికి బాధ్యత వహిస్తారని ప్రజల మండిపడుతున్నారు. స్థానిక కట్టుబడిపాలెం వద్ద ఉన్న జగనన్న లేవట్ల దగ్గర ట్రాన్స్ఫార్మర్, విద్యుత్ స్తంభం పరిస్థితి కూడా అలానే ఉంది. ప్రతిరోజు కరెంటు కట్ చేయడం తెలుసు కానీ మెయింటెన్ చేయడం మాత్రం అధికారులకు తెలియదా అంటూ ప్రజలు మండిపడుతున్నారు. టైంకి కరెంట్ బిల్లులు కట్టించుకోవడం కాదు ప్రజలకు నిరంతరయంగా కరెంటు ఇవ్వడంలోనూ, ఇలా చెట్లు మొలిచిపోయిన విద్యుత్ స్తంభాల వద్ద చెట్లను తొలగించడం చేస్తే కూడా బాగుంటుందని ప్రజలు అంటున్నారు. ఇకనైనా కరెంటు అధికారులు వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరుతున్నారు.



# టీడీపీ శాశ్వతసభ్యత్వం స్వీకరించిన మంత్రి ఆనం కుటుంబం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు ఎమ్మెల్యే, రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శుక్రవారం తాను, తన కుటుంబ సభ్యులతో కలిసి టిడిపి శాశ్వత సభ్యత్వం స్వీకరించారు. మంత్రి లక్ష రూపాయలు చెల్లించి ఆత్మకూరు పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి నుండి శాశ్వత సభ్యత్వ కార్డును స్వీకరించారు. రామనారాయణరెడ్డి కుమార్తె లీలాకైవల్యారెడ్డి, కుమారుడు ఆనం శుభకర్‌రెడ్డి, రామనారాయణరెడ్డి అన్న ఆనం వివేకానందరెడ్డి కుమారుడు ఆనం రంగమయూర్‌రెడ్డిలు కూడా లక్షరూపాయల వంతున చెల్లించి తెలుగుదేశం శాశ్వత సభ్యత్వం పొందారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పరిశీలకులు బుల్లెట్‌రమణ, సుఖవాసి శ్రీనివాస్, ఆత్మకూరు పట్టణ టిడిపి అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, రాష్ట్ర తెలుగుమహిళ కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, రాష్ట్ర తెలుగుదేశం కార్యదర్శి దావా పెంచలరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, వైస్‌చైర్మెన్ షేక్ సర్దార్,కౌన్సిలర్లు చెరుకూరు శ్రీనివాసులునాయుడు, షేక్ గౌస్‌బాషా, కొప్పోలు రమాదేవి, గంధళ్ళ వేణు, సూరా భాస్కరరెడ్డి, టిడిపి నాయకులు పల్లవోలు జయాకర్, గొట్టిగుండాల బుజ్జిరెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, దోర్నాదుల సురేష్‌బాబు, షేక్ రేష్మా, రబ్బాని, ఖాదర్‌మస్తాన్, గోరీషబ్బీర్, నలిశెట్టి శ్రీనయ్య, నలిశెట్టి రవికుమార్, డక్కా మల్లికార్జున, బొగ్గవరపు శ్రీకాంత్‌నారాయణ, చిట్టమూరు వెంకటేశ్వర్లురెడ్డి,దాసరి మధుసూధనరావు, దాసరి బాలకృష్ణ, పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రూ.7కోట్లతో అభివృద్ధి పనులు



**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలానికి రూ.7.5కోట్ల రూపాయల నిధులను కావలి ఎమ్మెల్యే దగుమాటీ వెంకట క్రిష్ణారెడ్డి మంజూరు చేశారని బోగోలు మండల టిడిపి అధ్యక్షులు మాలేపాటి నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం మండల టిడిపి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కావలి నియోజకవర్గానికి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ఎనలేని సేవలు చేస్తున్నారంటూ గడచిన ఐదు నెలలలోనే నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను పరిష్కరిస్తూ ప్రజల మన్ననను పొందారని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వంలో జరగని ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటినుండి అభివృద్ధి ఏ విధంగా చేయాలో చేసి చూపించారని అన్నారు. బోగోలు మండలంలో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలువ పనులకు 2, కోట్ల 96 లక్షల 50వేల రూపాయలు, ఎఫ్‌టిఆర్ క్రింద ఎస్విపియం కెనాల్ కాలువకు 84లక్షల 80,000 వేల రూపాయల నిధులను మంజూరు చేశారని, మండలానికి మొత్తం 50 గోకులాల షెడ్లు మంజూరయ్యా అని, వాటి నిర్మాణానికి ఒక కోటి 15 లక్షల రూపాయలు నిధులను విడుదల చేశారని, ఒక్క గోకులం షెడ్డు నిర్మాణానికి 2 లక్షల 30వేల రూపాయలు మంజూరు చేశారని తెలిపారు. మండలంలో అనారోగ్యంతో బాధపడుతున్న 30 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ క్రింద మొదటి విడతగా 11 మందికి 12 లక్షల 5వేల రూపాయల చెక్కును బాధితులకు అందజేశారని తెలిపారు. కావలి, దగదర్తి, గౌరవరం, బోగోలు మండలానికి ప్రధాన కాలువ ద్వారా 900 క్యూసెక్కుల నీరు రావలసి ఉంది. అయితే ప్రస్తుతం 400 క్యూసెక్కుల నీళ్లు కూడా అందక రైతులు ఇబ్బంది పడుతుంటే కాలువ పూడిక తీత కోసం మూడు కోట్ల 84 లక్షల రూపాయల నిధులను మంజూరు చేశారని, సిఆర్ పాలెం పంచాయితీ తాటి చెట్లపాలెం గ్రామం సముద్రం కోతకు రోడ్డు దెబ్బతింటే మత్స్యకారుల కోసం రెండు కోట్ల రూపాయల నిధులను మంజూరు చేశారని, ఈ సందర్భంగా కావలి శాసనసభ్యుడు క్రిష్ణారెడ్డికి బోగోలు మండల ప్రజలు, రైతులు తరుపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఎన్న బత్తిన వెంకటేశ్వర్లు, ఎల్ సుదీర్ బాబు, ఎల్.మాధవరావు, రఘురాం నాయుడు, వెంకటేశ్వర్ రెడ్డి, విజయ్ యాదవ్, సుధాకర్ యాదవ్, ప్రభాకర్, వెంకటేశ్వర్ రెడ్డి, అహ్మద్ బాషా, రఫీ టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పది రోజుల్లోగా రీసర్వే గ్రామసభల దరఖాస్తులు పరిష్కరించాలి

**రెవెన్యూ అధికారుల కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ కార్తీక్**



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** రీసర్వే సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తులను పది రోజుల్లోగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కావలి, కందుకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహశీల్దార్లు, సర్వేయర్లతో జేసీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. రీసర్వేలో రైతుల పేర్లు తప్పుగా నమోదు కావడం, విస్తీర్ణం తేడా రావడం వంటి పలు రీ సర్వే సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా నిర్వహించిన గ్రామసభల్లో వచ్చిన అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. ఎఫ్ లైన్ సర్వే, పట్టా సబ్ డివిజన్ దరఖాస్తులు సర్వేయర్ లాగిన్‌లో పెండింగ్ ఉండకూడదన్నారు. అలాగే ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీల పరిష్కారంపై దృష్టిపెట్టాలన్నారు. అన్ని అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో సాంకేతికంగా ఎదురయ్యే సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. రెవెన్యూ అధికారులందరూ బాధ్యతాయుతంగా పనిచేసి భూసమస్యల పరిష్కారానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డిఆర్‌వో ఉదయభాస్కర్‌రావు, కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ, కావలి ఆర్డీవో వంశీకృష్ణ, తహశీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

## మర్యాదపూర్వకంగా డీఎస్పీని

# కలిసిన జనసేన నాయకుడు



**సీతారాంపురం, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని సీతారాంపురం పోలీస్ స్టేషన్ ను శుక్రవారం కావలి డీఎస్పీ శ్రీధర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీతారామపురం మండల జనసేన యువనాయకుడు భోగినేని కాశీరత్తయ్య (గాంధీ) మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. అనంతరం మండలంలోని సమస్యలను డిఎస్పి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. సీతారాంపురం గ్రామపంచాయతీలో ఏపీ మోడల్ స్కూల్, ఎల్విఆర్ జూనియర్ కాలేజ్, సీతారామ డిగ్రీ కాలేజ్ విద్యార్థులు కళాశాలలకు వెళ్లేటప్పుడు అనంతరం తిరిగి వచ్చేటప్పుడు కొంతమంది యువకులు బైకులపై తిరుగుతూ విద్యార్థినిలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా మండలంలో అధికంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారని వాటిపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న మాక్‌పార్లమెంట్



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని పేరారెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులు నిర్వహించిన మాక్‌పార్లమెంట్ ఆస్కూలు ఉపాధ్యాయులను, విద్యార్థులను, గ్రామస్థులను విశేషంగా ఆకట్టుకుంది. భారతరాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సోమవరపు భాస్కరరెడ్డి పర్యవేక్షణలో సాంఘిక ఉపాధ్యాయుడు పార్లపల్లి నాగరాజారావు ఆధ్వర్యంలో విద్యార్థులు మాక్‌పార్లమెంట్ నిర్వహించారు. స్పీకర్, మంత్రులు, అధికారపక్ష, ప్రతిపక్ష సభ్యులు, ప్రశ్నలు, సమాధానాలు తదితరాలతో పార్లమెంట్ ఆకట్టుకుంది. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సి.హెచ్.శ్రీనివాసరావు, కె.సుబ్రహ్మణ్యం, రొట్టె వెంకటేశ్వర్లు, డి.మాల్యాద్రి, మహబూబ్‌ఖాన్, కె.సి.మస్తానయ్య, పి.డి.పి.సుమతి, సిబ్బంది, విద్యార్థినీవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మాతృత్వం ఒక వరం.. దత్తత దానికి మరో మార్గం : జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** మహిళా శిశు సంక్షేమ శాఖ రూపొందించిన మాతృత్వం ఒక వరం.. దత్తత దానికి మరో మార్గం పోస్టర్స్‌ను జిల్లా కలెక్టర్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నూతనంగా రూపొందించిన మార్గదర్శకాల ప్రకారం దత్తత పోందటం అతి సులభం అయిందన్నారు. దత్తత ఎలా పొందాలి అనే అంశాలు, కావలసిన ధ్రువ పత్రాల గురించి పోస్టర్ లో విశదంగా వివరించారన్నారు. దత్తతకు సంబంధించిన మరింత సమాచారం కొరకు అంగన్వాడీ కేంద్రాల్లో గాని, ఐసీడీఎస్ అధికారులను గాని, జిల్లా బాలల పరి రక్షణ అధికారులను గాని సంప్రదించాలని కోరారు. దత్తత ప్రక్రియను ఆన్‌లైన్ వెబ్‌సైట్ www. Cara.nic.in ద్వారా చేసు కోవచ్చున్నారు. చట్ట విరుద్ధంగా దత్తత తీసుకున్న వారికి 3 నుండి 7 సంవత్సరాల వరకు కఠిన కారాగార శిక్ష,లక్ష రూపాయల జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్, బాలల సంరక్షణ అధికారి బి.సురేష్ పాల్గొన్నారు.

# మద్యం షాపును ఎత్తివేయాలని గాంధీ విగ్రహానికి వినతి



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** 25 రోజులుగా వాకర్స్ రోడ్ లోని మద్యం షాపుని ఎత్తివేయాలని మహిళ పలు ప్రజాసంఘాలు ఉద్యమిస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడంలేదని శాంతియుతంగా ఉద్యమిస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఎక్సైజ్ అధికారులు సైతం చోద్యం చూస్తున్నారని కాంగ్రెస్ మీడియా ఇన్‌చార్జ్ అడ్వకేట్ కే.సంజయ్ కుమార్ అన్నారు. డీసీసీ చేవూరి దేవకుమార్ రెడ్డి పిలుపుమేరకు వాకర్స్ రోడ్డులోని లక్ష్మీ మద్యం షాపు ఎత్తివేయమని కూటమి ప్రభుత్వం వచ్చాక మద్యం విచ్చలవిడిగా జనావాసాల మధ్యకు తెచ్చారని అందుకు గాంధీ బొమ్మ వద్ద అన్ని ప్రజాసంఘాలతో కలిపి కాంగ్రెస్ పార్టీ శాంతియుతంగా నిరసన తెలియ చేస్తున్నదని,సంజయ్ అన్నారు. గత 25 రోజులుగా నిరసన తెలియజేస్తున్న స్థానికులకు మహిళలకు బాసటగా కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తున్నదని అడ్వకేట్ సుధీర్ తెలిపారు. చుట్టుపక్కల మసీదు దేవాలయాలు బాలికల హాస్టల్ మదరసాలు ఉన్నా అవి దేవాదయ శాఖ, వక్ఫ్ బోర్డులో లేవని సాంకేతిక కారణాలను సాకుగా చూపి ఇల్ల మధ్యలో మద్యం షాపు పెట్టారని, అవి ఎత్తేసే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని నెల్లూరు సిటీ ఇన్‌చార్జ్ కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఇర్ఫాన్, జుబేద్, అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఓ రాజకీయ నాయకుని అండతో రోడ్డున పడ్డ వృద్ధులు



## పట్టించుకోని అధికారులు

**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** తమకున్న పొలాన్ని ఓ కుటుంబం అవస రాలకు వాడుకొని పెద్దల సమక్షంలో 84 సెంట్లు భూమి రాసిచ్చి ఆ భూమి కూడా తమదేనని తమపై దౌర్జన్యం చేస్తున్నారని బుచ్చిరెడ్డిపాలెం మండలం పంచేదు గ్రామానికి చెందిన సత్యభామ, సాయిబాబా వృద్ధులు వాపోయారు. ఈ సందర్భంగా బాధితులైన సురేందర్ రెడ్డి, సత్యభామ, సాయిబాబా విలే కరుల సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. కొడవలూరు మండలం గుండాలమ్మ గ్రామంలో అక్కా తమ్ముడైన సత్యమ్మ, సాయిబాబా వృద్ధులు జీవనం సాగిస్తున్నారు. అయితే బుచ్చి మండలం పంచేదు గ్రామానికి చెందిన రఘురామిరెడ్డి వైజయంతమ్మ తమను నమ్మబలికి గుండాలమ్మ గ్రామంలో ఉన్న రెండు ఎకరాల 50 సెంట్లు భూమిని అమ్మిం చి బుచ్చి మండలం పంచెదు గ్రామంలో 2.50 ఎకరాల భూమి కొనిచ్చారని తెలిపారు. అయితే ఆ భూమిని రఘురామిరెడ్డి, వైజయంతమ్మ కూతురు పేరు మీద రాయించుకుని కూతురు పెళ్లి నిమిత్తం ఆ రెండు ఎకరాల 50 సెంట్లు భూమిని వాడుకున్నారని తెలిపారు. దీనిపై పెద్దల సమక్షంలో చర్చ జరిగినప్పుడు రఘురామిరెడ్డికి ఉన్న ఒక ఎకరా 84 సెంట్లు భూమిలో 84 సెంట్లు వృద్ధులకు, ఒక ఎకరా పొలం, ఇల్లు రఘురామిరెడ్డి, వై.జయంతమ్మ దత్తకు తీసుకున్న కుమారుడి సురేందర్ రెడ్డికి రాసిచ్చారు. అయితే ఇటీవల రఘురామిరెడ్డి చనిపోయాడు. దీంతో వై జయంతమ్మ, కూతురు, అల్లుడు ఇదే అదునుగా చూసుకొని వృద్ధులకు దత్తత పుత్రుడుకు ఇచ్చిన ఆస్తి తమదేనని తమపై దౌర్జన్యం చేస్తున్నారని వారు వాపోయారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే సీఐ శ్రీనివాసులు రెడ్డి వాళ్లకే సపోర్ట్ చేస్తూ తమ మీద తప్పుడు కేసులు పెడతామని బెదిరిస్తున్నారని వాపోయారు. దీని మీద ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి స్పందించి తమకు న్యాయం చేయాలని వృద్ధులు సురేందర్ రెడ్డి వేడుకున్నారు.

# డిసెంబర్ 7న మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్ జయప్రదం చేయండి



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** పాఠశాల పట్ల పిల్లలకు, తల్లిదండ్రులకు నమ్మకం పెంచడానికి డిసెంబర్ 7వ తేదీ మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహిస్తున్నామని బుచ్చిరెడ్డిపాలెం ఎంపిడిఒ ఎం.శ్రీహరి అన్నారు. బుచ్చి రెడ్డిపాలెం ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ ప్రణాళికాయుతంగా నిర్వహించాలని, తల్లిదండ్రులకు పోటీలు నిర్వహించి బహుమతులు అంద జేయాలన్నారు. తల్లిదండ్రులకు తప్పనిసరిగా ఆహ్వాన పత్రికను ఇవ్వాలని, ప్రతి ఒక్కరూ హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పిల్లల ప్రగ తిపై చర్చ జరగాలని, పాఠశాల అభివృద్ధికి ఆ మీటింగ్ ఒక వేదికగా నిలవా లన్నారు. ప్రధానోపాధ్యాయులకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ పీవీ రత్నం, మెప్మా ఏవో ఐవీ సుధాకర్ రావు, జిల్లా రిసోర్స్ గ్రూప్ సభ్యులు గండికోట సుధీర్ కుమార్, ప్రధానోపాధ్యాయులు, సిఆర్ఎంటిలు పాల్గొన్నారు.

# ప్రజలను ఆకట్టుకున్న మెప్మా అర్బన్ మార్కెట్ సెంటర్లు




**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** బుచ్చిరెడ్డిపాలెం పట్టణంలోని పార్క్ సెంటర్ వద్ద మెప్మా ఆధ్వర్యంలో మెప్మా అర్బన్ మార్కెట్ ఏర్పాటు చేశారు. మెప్మా పొదుపు సంఘాల మహిళలు స్వయంగా తయారు చేసిన పలు రకాల వస్తువులను, ఆహార పదార్థాలను ఎగ్జిబిషన్‌గా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నగర పంచాయతీ చైర్ పర్సన్ మోర్ల సుప్రజా మురళి అర్బన్ మార్కెట్‌ను పరిశీలించారు. మహిళలు స్వయంగా తయారుచేసిన వస్తువులను సందర్శించి కొనుగోలు చేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు పొదుపు సంఘాల ద్వారా తీసుకుంటున్న రుణాలను సద్వినియోగం చేసుకొని వ్యాపారాలు చేసుకుంటూ స్వయం శక్తితో ఎదగాలన్నారు. మహిళలు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మెప్మాలోని పొదుపు సంఘాల మహిళలకు పూర్తి సహకారాన్ని అందిస్తున్నామని చెప్పారు. తక్కువ ధరలకే నాణ్యమైన వస్తువులను, ఆహార పదార్థాలను తయారుచేసి విక్రయించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బిట్రగుంట ప్రమీలమ్మ, పుట్టా లక్ష్మీకాంతమ్మ, తాళ్ల వైష్ణవి, టిడిపి నాయకులు తాళ్ల స్వామి, మెప్మా సీ వో నర్మద, ఆర్పీలు, పొదుపు సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఫించన్లు పంపిణీ కార్యక్రమం : ఎంపీడీఓ



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండలంలోని గ్రామ సచివాలయం సిబ్బంది ఫించన్లు పంపిణీ కార్యక్రమం వారికి కేటాయించిన క్లస్టర్ నందు శనివారం ఉద యం 6గంటల నుండి పంపిణీ ప్రారంభి స్తారని ఎంపీడీఓ ప్రసన్నకుమారి తెలియజేశా రు. ఏఎస్ పేట మండలానికి డిసెంబర్ నెల కు 4959 పింఛన్లు విడుదలయ్యాయని అందుకు సంబంధించి 2,11,71,500.00 రూపాయలు డ్రా చేసి సంబంధిత సచివాలయ సిబ్బందికి అందజేశామని ఆమె తెలిపారు. ఈనెల నుండి తాత్కాలికంగా గ్రామంలో లేని వారికి మూడు నెలలపాటు పెన్షన్ ఇవ్వడం జరుగుతుందని, అలాగే భర్త చనిపోతే భార్యకు అదే నెల లో వితంతు పింఛను మంజూరు చేస్తామని తెలిపారు. సచివాలయం సిబ్బంది స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకొని ఫించన్లు పంపిణీని ఉదయం నుండి ప్రారంభించవలసిందిగా ఎంపీడీవో తెలిపారు.

# ఈ పంట నమోదు తప్పనిసరి : ఏవో



**విడవలూరు, మేజర్‌న్యూస్ :** ప్రతి రైతు తాము వేసిన పంటకు సంబం ధించి ఈ పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి వెంకట కృష్ణయ్య కోరారు. ఈ పంట నమోదు కార్యక్రమంపై శుక్రవారం మండలంలోని వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులకు ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విస్తరణ అధికారులు మండలంలోని ప్రతి రైతు వద్దకు వెళ్లి ఈ పంట నమోదును తప్పనిసరిగా చేయాలని ఆదేశించారు. అదేవిధంగా ఈ పంట నమోదు విషయంలో కూడా రైతులు సహకరించాలని ఈ పంట నమోదును తప్పనిసరిగా చేయించుకోవాలని కోరారు. పంట రుణాలు కావాలన్నా, పంట నష్టపరిహారం పొందాలన్న, వివిధ ప్రభుత్వ పథకాలు అందాలన్న, తప్పనిసరిగా ఈ పంట నమోదు ఉండాలని కోరారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రతి రైతు కూడా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

# విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించండి : ఏఈ



**చేజర్ల, మేజర్‌న్యూస్ :** చేజర్ల మండలంలోని ఆదురుపల్లిలో విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించమని విద్యుత్ శాఖ ఏఈ లిఖిత్ రెడ్డి గ్రామస్తులను కోరారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి తిరిగి స్కానర్ ద్వారా విద్యుత్ బిల్లులను చెల్లించే విధానం తెలియజేశారు. పాత బకాయిలు ఉన్న వారి వద్ద విద్యుత్ బిల్లులు కట్టించారు. ఈ కార్యక్రమంలో ఏఈ లిఖిత్ రెడ్డి, లైన్ మెన్, విద్యుత్ శాఖ సిబ్బంది, నెల్లూరు డివిజన్ ఆఫీసు నుండి బకాయిలు వసూలు నిమిత్తం వచ్చిన ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

# నేడే ఫించన్లు పంపిణీ

**విడవలూరు, మేజర్‌న్యూస్ :** సామాజిక ఫించన్లు శనివారం పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీవో నగేష్ కుమారి తెలిపారు. ఆదివారం సెలవు దినం కావడంతో ఒకరోజు ముందుగానే అర్హులైన వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, వృద్ధులకు పెన్షన్లు అందజేయనున్నట్లు తెలిపారు. మిగిలినవారికి సోమవారం పంపిణీ చేస్తామని తెలిపారు. దీంతోపాటు గత నెలలో పెన్షన్ తీసుకోనటువంటి లబ్ధిదారులకు ఈ నెలలో రెండు నెలల పెన్షన్లు అందించడం జరుగుతుందన్నారు.

# ఎస్పీ కృష్ణకాంత్‌ను కలిసిన జనసేన గునుకుల కిషోర్

## - న్యూడ్ వీడియో కాల్స్‌పై ఎస్పీకి ఫిర్యాదు



**నెల్లూరు నగరం, మేజర్‌న్యూస్ :** న్యూడ్ వీడియో కాల్స్ ద్వారా జరిగే స్కామ్స్ రోజురోజుకు పెరిగిపోతున్నాయని, వాటి వల్ల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్‌కి జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ.. కొన్ని హానికరమైన యాప్‌లు ప్లే స్టోర్ నుండి నిషేధించబడినప్పటికీ, వారు మోసపూరిత లింక్‌లను ప్రజలకు పంపుతూ, వారి అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని ట్రాప్ చేస్తున్నారని కిషోర్ చెప్పారు. అటువంటి మోసపూరిత లింకుల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆయా యాప్‌ల పేర్లు, వివరాలను పోలీస్ శాఖ వారు బహిర్గతం చేస్తే, ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుందని ఆయన సూచించారు. చిన్నారులపై జరుగుతున్న నేరాలు, మాదక ద్రవ్యాల దుర్వినియోగం, రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పోలీసులు చేస్తున్న నిరంతర కృషి అభినందనీయం అని అన్నారు. అదేవిధంగా, న్యూడ్ వీడియో కాల్ స్కామ్‌ల ప్రమాదాల గురించి కూడా పటిష్టమైన అవగాహన ప్రచారాలను రూపొందించాలని పోలీసు వారిని కోరారు. ఈ స్కామ్‌లు గణనీయమైన ఆర్థిక నష్టాలను కలిగించడమే కాకుండా బాధితుల్లో తీవ్ర మానసిక క్షోభకు గురిచేస్తున్నాయి. ఇటీవల, నెల్లూరు వాసులు కొందరు ఈ మోసాలకు బలైపోయారు. ఈ మోసపూరిత కార్యకలాపాలపై కఠినమైన నిషేధాలు, నియంత్రణను విధించాలని పోలీసులను అభ్యర్థించారు. ఈ విషయంపై స్పందించిన జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, ఇప్పటికే ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని, బాధితులు ఎవరైనా ఫిర్యాదు ఇస్తే పోలీసులు బాధితులకు అండగా నిలబడతామని, అలాగే ఈ విషయంలో బాధితులు ఎవరైతే ఉన్నారో వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్పీ హామీ ఇచ్చారు. ఈ మోసాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి పట్టుకునేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరుతూ ప్రజలకు తగు సూచనలు చేసారు. తెలియని వ్యక్తులతో వ్యక్తిగత సమాచారం పంచుకోరాదు. అనుమానాస్పద వీడియో కాల్‌లు లిఫ్ట్ చేయకూడదు. తెలియని లింక్‌లకు క్లిక్ చేయకూడదు. ఈ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్న జిల్లా ఎస్పీ కృష్ణకాంత్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు గునుకుల కిషోర్ తెలిపారు. అలాగే మాదక ద్రవ్యరహిత ఆంధ్ర ప్రదేశ్ నిర్మాణం కోసం ప్రభుత్వం ముందడుగు వేస్తూ నిన్ననే ఎలైట్ యాంటీ నార్కోటిక్ గ్రూప్ ఫర్ లా ఎన్ఫోర్స్మెంట్ (ఈగల్) టీంని ఏర్పాటు చేస్తూ జీవో విడుదల చేసింది. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వానికి కిషోర్ కృతజ్ఞతలు తెలియజేశారు.

# బాబోయ్ వైరల్ జ్వరాలు

- మంచాన పడుతున్న జనం
- రాపూరు ప్రభుత్వ ఆసుపత్రికి రోజుకి 50 నుంచి 60 కేసులు
- త్రాగునీటి కలుషితం వల్లే అంటున్న వైద్యాధికారులు
- తమకేమీ పట్టనట్లున్న గ్రామీణ నీటి సరఫరా శాఖ




**రాపూరు, మేజర్‌న్యూస్ :** వైరల్ జ్వరాలతో రాపూరుతో పాటు పలు గ్రామాల నుండి ప్రజలు ప్రభుత్వాసుపత్రితోపాటు ప్రైవేటు ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు.ఒక్క రాపూరు ప్రభుత్వ ఆసుపత్రిలోనే రోజుకి 50నుంచి 60 కేసులు నమోదు అవుతున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వ్యాధిగ్రస్తులు జ్వరంతో పాటు కీళ్ళ నొప్పులుతో ఎక్కువగా బాధ పడుతున్నారు. ప్రధానంగా త్రాగు నీటి కలుషితం వల్లే వైరల్ జ్వరాలు వ్యాప్తి చేందుతున్నాయని రాపూరు సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ వి.సరస్వతి మేజర్‌న్యూస్‌కి తెలిపారు. వైరల్ జ్వరాలు నాలుగు ఐదు రోజుల్లో తగ్గిపోతాయని, కాచి చల్లార్చిన నీరు త్రాగాలని సూచించారు.సాధారణ సీజనల్ వ్యాధులు ఈ సమయంలో వస్తాయని తెలిసినా సంబధిత అధికారులు తగిన చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ దుస్థితికి కారణం అని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇదే విషయమై రాపూరు ఎంపీడీఓ భవానీని మేజర్ న్యూస్ వివరణ కోరగా పంచాయితీ కార్యదర్శులకి పారిశుధ్యం మీద దృష్టి సారించమని ఆదేశిస్తామన్నారు. గ్రామీణ నీటి సరఫరా శాఖ ఏఈతో ఫోన్‌లో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే విషయమై వేపినాపి వైద్యాధికారిణి ప్రమీలని మేజర్‌న్యూస్ వివరణ కోరగా అందరూ ఏఎన్ఎంలు, ఆశాలు, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నారని, వైరల్ జ్వరాలతో బాధపడుతున్న వారిని ఆసుపత్రికి తీసుకొచ్చి చికిత్స అందించేలా ఏఎన్ఎంలకి ఆదేశిస్తామన్నారు. ఇకనైనా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు గ్రామాల్లో ప్రజలకి సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల ప్రజలు కోరుతున్నారు.

# గంటకు 9 కిలోమీటర్ల వేగంతో దూసుకొస్తున్న ఫంగల్ తుపాన్

## ▶ అప్రమత్తమైన అధికార యంత్రాంగం ▶ రంగంలోకి ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు

**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** నైరుతి బంగాళాఖాతం (బే ఆఫ్ బెంగాల్)లో ఏర్పడిన అల్పపీడనం ఇవాళ (శుక్రవారం) తీవ్ర వాయుగుండంగానే కొనసాగనుందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. గడిచిన 6 గంటల్లో గంటకు 9 కిలోమీటర్ల వేగంతో ఫెంగల్ తుపాను కదులుతోందని ఆయన చెప్పారు. ప్రస్తుతానికి ట్రింకోమలీకి 240 కి.మీ., నాగపట్నానికి 330 కి.మీ., పుదుచ్చేరికి 390 కి.మీ., చెన్నైకి 430 కి.మీ. దూరంలో తుపాను కేంద్రీకృతమైందని కూర్మనాథ్ వెల్లడించారు. శనివారం ఉదయానికి ఉత్తర తమిళనాడు-పుదుచ్చేరి తీరాల సమీపంలో కారైకల్, మహాబలిపురం మధ్య పుదుచ్చేరి దగ్గరలో తీరం దాటే అవకాశం ఉందని ఆయన తెలిపారు. దీని ప్రభావంతో ఇవాళ, రేపు దక్షిణకోస్తా, రాయలసీమలో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని కూర్మనాథ్ వెల్లడించారు. ఇతర జిల్లాల్లో విస్తారంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని ఆయన చెప్పారు. తీరం వెంబడి గంటకు 45 నుంచి 65 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వెల్లడించారు. తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని ఆయన హెచ్చరికలు జారీ చేశారు. రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కూర్మనాథ్ వెల్లడించారు. కాగా, ఫెంగల్ తుపాను ప్రభావంతో తమిళనాడులోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు పడుతున్నాయి. చెన్నైలో నిన్న రాత్రి నుంచీ ఎడతెరిపిలేని వర్షాలు



కురుస్తున్నాయి. చెంగల్ పట్టు, విల్లుపురం, కడలూరు, మైలాడుత్తురై, తిరువారూర్ జిల్లాలకు ఆ రాష్ట్ర ప్రభుత్వం రెడ్ అలర్ట్ ప్రకటించింది. కడలూరు, నాగపట్నం తీరం అల్లకల్లోలంగా మారింది. పుదుచ్చేరి, కారైకల్, కడలూరులో విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు.

## నేడే సామాజిక పింఛన్ల పంపిణీ



**రాపూరు, మేజర్‌న్యూస్ :** డిసెంబర్ ఒకటి ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే నవంబరు 30నే ఒక రోజు ముందు గానే పింఛన్ల పంపిణీ జరుగుతుందని ఎంపిడీఓ భవానీ తెలిపారు. గత నెలలో పింఛను తీసుకోని వారికి ఈ నెలలో రెండూ కలిపి ఇవ్వడం జరుగుతుందన్నారు. రాపూరు మండలం లో కేవలం ఆరుగురు మాత్రమే గత నెలలో పింఛను తీసుకోలేదని వారికి ఈనెలలో కలిపి ఇవ్వడం జరుగుతుందన్నారు. శనివారం తీసుకోలేని వారు ఆందోళన చెందాల్సిన పని లేదని సోమ, మంగళవారాల్లో యధావిధిగా పింఛన్ల పంపిణీ జరుగుతుందన్నారు.

## అయ్యప్ప భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని శ్రీ అరుంధతీయ సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక శివాలయంలో కార్తీక మాసంలో 28వ రోజైన శుక్రవారం మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ నిర్వహించారు. ఈ నిత్యాన్నదాన కార్యక్రమంలో మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన అయ్యప్ప స్వాములు, భవానీలు, శివ, గోవింద, తదితర మాలధారణ చేసిన స్వాములు భిక్ష స్వీకరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ అరుంధతీయ సేవ సంఘం సభ్యులు శ్రీనివాసులు, ప్రసాద్, పెంచలయ్య, ఎం. పెంచలయ్య, అయ్యప్ప సేవా సమాజం గౌరవ అధ్యక్షులు శివాడి పరంధామి రెడ్డి, సెక్రటరీ చొప్పా వెంకటేశ్వర్లు (చిరు) ట్రెజరర్ అడపాల మస్తాన్ రెడ్డి, ఐతా రవి, ఇండ్ల రవి, జీ.మహేష్, వెంకటరమణ, ఉన్నారు.

## పుణ్యక్షేత్రానికి ఆర్టీసీ బస్సు నడపండి



**నెల్లూరు కల్చర్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండ బిట్రగుంట ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంకు పోవాలంటే ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, భక్తులకు వీలుగా ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని సీనియర్ జర్నలిస్ట్ జయప్రతాప్ రెడ్డి శుక్రవారం నెల్లూరులో ఆర్టిసి చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అందుకు సానుకూలంగా స్పందించిన చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి తగు నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## మెగా పేరెంట్స్ మీటింగ్ ప్రిపరేషన్



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా డిసెంబర్ 7వ తేదీన మెగా పేరెంట్స్ మీటింగ్ ప్రతి పాఠశాల యందు నిర్వహించాలని దానికి సంబంధించి పాఠశాల యందు ఈ మీటింగ్ ఎలా నిర్వహించాలో సంబంధిత విషయాలను స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్‌తో ఆన్‌లైన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ మాట్లాడుతూ.. పాఠశాల యందు విద్యార్థులు, తల్లిదండ్రులతో వివిధ రకాలైన కమిటీలు ఏర్పాటు చేసుకొని ఒక పండుగ వాతావరణం లాగా ఈ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశానికి గ్రామంలోని ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని, అలాగే తల్లిదండ్రులతో విద్యార్థుల యొక్క ప్రగతి చర్చించాలని సూచించారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మండల విద్యాశాఖ అధికారి వి.శ్రీనివాసరెడ్డి, సిఆర్ఎంటిలు పాల్గొన్నారు.

# అందరి ఆరోగ్యం సీఎం చంద్రబాబు లక్ష్యం : మంత్రి ఆనం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యమని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నియోజక వర్గంలోని అనారోగ్యానికి గురైన 16మందికి 28లక్షల 90వేల 916 రూపాయల సీఎం సహాయనిధి చెక్కులను మంత్రి రామనారాయణరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ.. రాష్ట్రప్రభుత్వం ఆర్థికంగా ఎంతో ఇబ్బందుల్లో ఉన్నా పేదప్రజలకు సాయమందించడంలో ముఖ్యమంత్రి సహృదయంతో బాధితులకోసం ముఖ్యమంత్రి సహాయనిధులు ఉదారంగా మంజూరు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడిన కొద్దినెలల్లోనే ప్రజలకిచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్న చంద్రబాబు నాయుడుకే దక్కిందన్నారు. సిఎం సహాయనిధులు అందుకున్న లబ్ధిదారులు ఆరోగ్యంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో తెలుగుదేశం పరిశీలకులు బుల్లెట్‌రమణ, సుఖవాసి శ్రీనివాస్, ఆత్మకూరు పట్టణ టిడిపి అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, రాష్ట్ర తెలుగుమహిళ కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, రాష్ట్ర తెలుగుదేశం కార్యదర్శి దావా పెంచలరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, వైస్‌చైర్మెన్ షేక్ సర్దార్, కౌన్సిలర్లు చెరుకూరు



శ్రీనివాసులునాయుడు, షేక్ గౌస్‌బాషా, కొప్పోలు రమాదేవి, గంధళ్ళ వేణు, సూరా భాస్కరరెడ్డి, టిడిపి నాయకులు పల్లవోలు జయాకర్, గొట్టిగుండాల బుజ్జిరెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, దోర్నాదుల సురేష్‌బాబు, షేక్ రేష్మా, రబ్బాని, ఖాదర్‌మస్తాన్, గోరీషబ్బీర్, నలిశెట్టి శ్రీనయ్య, నలిశెట్టి రవికుమార్, దక్కా మల్లికార్జున, బొగ్గవరపు శ్రీకాంత్‌నారాయణ, చిట్టమూరు వెంకటేశ్వర్లురెడ్డి, దాసరి మధుసూధనరావు, దాసరి బాలకృష్ణ, పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటిపన్ను, ఆన్‌లైన్ ప్రక్రియను వెంటనే పూర్తిచేయాలి : ఎంపీడీఓ





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** పంచాయతీల కార్య దర్శులు ఇంటిపన్నుల వసూలు, అందుకు సంబంధించిన అసెస్మెంట్ ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతం చేసి వెంటనే పూర్తి చేయాలని ఆత్మ కూరు ఎంపీడీఓ పి.ఐజాక్‌ప్రవీణ్ ఆదేశించారు. ఆయన శుక్రవారం మండలంలోని నువ్వురు పాడు, మహిమలూరు సచివాలయాలను, ఆయా గ్రామాల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఆయన సచివాలయ సిబ్బంది నుద్దేశించి ప్రసంగిస్తూ ప్రతి ఇంటికి సంబం ధించి జియోటాగింగ్ (ఎన్‌పిసిఐ) బ్యాంక్ లింకిం గ్ పనులను కూడా త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. కొత్తగా గృహనిర్మాణాలను చేపట్ట దలచిన వారు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేయించు కోవాలని ఆయన కోరారు. వ్యక్తిగత మరుగు దొడ్లు అవసరమైనవారిని గుర్తించి ఇంజనీరింగ్ అసిస్టెంట్లు జియోటాగింగ్ ప్రక్రియను పూర్తిచే యాలని ఎండివో సూచించారు. నువ్వురుపాడు, మహిమలూరు సచివాలయాల్లో ఆయన బయో మెట్రిక్ హాజరును పరిశీలించారు. ఈనెల 30వ తేదీ (శనివారం) ఉదయం 6గంటలనుండే సచి వాలయ సిబ్బంది పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని తప్పకుండా ప్రారంభించాలని ఎండివో ఆదేశిం చారు. పెన్షన్లను లబ్ధిదారుల ఇళ్ళవద్ద పంపిణీ చేసే కార్యక్రమాన్ని వేగవంతంగా నిర్వహించి సాయంత్రానికి 100శాతం పూర్తయ్యేలా చూడా లని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో ఆయా సచివాలయాలకు సంబంధించిన గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరులో ఆవాజ్ దినోత్సవం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులోని టెక్కె ఉర్దు పాఠశాలలో ఆవాజ్ ఆవిర్భావదినోత్సవ కార్యక్రమాన్ని మండల ఆవాజ్ కార్యదర్శి పి.యస్థానిబాషా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా యస్థానిబాషా మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన బోధనగావిస్తున్న ఉపాధ్యాయులు షేక్ కాలేషా, సుసీలమ్మలకు ఆయన అభినందనలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ముస్లిండెవలప్‌మెంట్ ఫోరమ్, ఆవాజ్ ఏర్పాటుకు గల కారణాలను వివరించారు. ఆవాజ్ అభివృద్ధి, భద్రత, లౌకికవాదం అనే అంశాలపై పనిచేస్తుందని ఆయన విద్యార్థులకు వివరించారు. సారేజహాసేఅచ్చా, హిందూసితారహమారా గేయరచయిత మహ్మద్ ఇక్బాల్, భారతదేశ జాతీయజెండా రూపశిల్పి, సురయ్యత్యాజి, ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదరూపకర్త మౌలానా హస్రత్ మోహాని, జైహింద్ నినాదం అబిద్ హసన్ సఫ్రాణి, మన దేశానికి అణుబాంబు తయారు చేసిన ఏపిజె అబ్దుల్‌కలామ్ తదితర మహనీయులను గురించి ఆయన విద్యార్థులకు



వివరించారు. అనంతరం విద్యార్థులకు పెనాలు, చాక్లెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ మండల కమిటీ సభ్యులు పి.మస్తాన్, పి.సల్మాన్‌ఖాన్, షేక్ ఖాజారంతుల్లా, ఎస్‌డి వశీమ్అక్రమ్, షేక్ నాయబ్, షేక్ కాలేషా, షేక్ ఖాజాషరీఫ్, షేక్ హుస్సేన్, ఎన్‌డి మహబూబ్‌బాషా, షేక్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

# రూరల్ మండలంలో నేడే ఫించన్లు పంపిణీ కార్యక్రమం



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫించన్లు పంపిణీ కార్యక్రమం డిసెంబర్ ఒకటో తేదీ నిర్వహించాల్సింది ఉండగా ఒకటో తేదీ ఆదివారం రావడంతో నవంబర్ 30వ తేదీ అనగా నేడే ఫించన్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు నెల్లూరు రూరల్ మండలం ఎంపీడీవో శైలేంద్ర కుమార్ మాట్లాడుతూ.. నెల్లూరు రూరల్ మండలంలోని 18 గ్రామపంచాయతీలో నేడే ఫించన్లు పంపిణీ జరుగుతుందని ఫించన్లు దారులు ఇంటి వద్దనే ఉండి పెన్షన్ తీసుకోవలసినదిగా కోరారు. నెల్లూరు రూరల్ మండలంలో 5931 పెన్షన్లు లకు సంబంధించిన 2,54,34,000 రూపాయలు డ్రా చేసి సంబంధించిన పంచాయతీ కార్యదర్శులకు ఇవ్వడం జరిగింది. అదేవిధంగా ఫించన్లు డిసెంబర్ నెల తీసుకొని వారికి మూడు నెలలు అవకాశం ఇస్తూ ఫించన్లు దారులకు వెసులుబాటు కల్పించారు. ఫించన్లు దారులు ఎవరైనా మరణించినట్లయితే వారి భార్యకు వితంతు ఫించన్‌ను మరుసటి నెలలో పెన్షన్ మంజూరు చేస్తున్నట్లు ఇస్తున్నట్లు తెలిపారు.

# విద్యార్థులకు ఇండస్ట్రియల్ విజిటింగ్




**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠ శాలకు చెందిన 9, 10తరగతుల విద్యార్థులకు శుక్రవారం ఇండస్ట్రియల్ విజిట్ కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు బి.చినపెంచలయ్య కార్యక్రమాన్ని ప్రారంభించగా ఒకేషనల్‌ట్రైనర్ నాగం వెంకటేశ్వర్లు విద్యార్థులను స్థానిక సూపర్ మార్కెట్‌కు తీసుకెళ్ళి అవగాహన కల్పించారు. సూపర్‌మార్కెట్‌లో క్యాషియర్ విధుల నిర్వహణ, బాధ్యతలు గురించి వివరించారు. సరుకుల నిల్వలు, విక్రయాల గురించి సూపర్‌మార్కెట్ యజమాని వివరించారు. విద్యార్థుల సందేహాలను ఆయన నివృత్తి చేశారు. ఒకేషనల్ కోర్సులవలన విద్యార్థినీ, విద్యార్థులు స్వయం ఉపాధి పొందే అవకాశాలను వివరించారు.

# ఉపాధ్యాయుడికి ఘనసన్మానం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని పేరారెడ్డిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో వెంగంపల్లి ఉన్నతపాఠశాల సాంఘిక ఉపాధ్యాయుడు ఎన్.మస్తానయ్యను ప్రధానోపాధ్యాయుడు సోమవరపు భాస్కరరెడ్డి పర్యవేక్షణలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు పార్లపల్లి నాగరాజారావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. భారతరాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించగా గురువారం విజేతలకు బహుమతీ ప్రదానం గావించిన సందర్భంగా సాంఘికశాస్త్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మస్తానయ్యను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మా నించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సి.హెచ్ శ్రీనివాసరావు, కె.సుబ్రహ్మణ్యం, రొట్టె వెంకటేశ్వర్లు, డి.మాల్యాద్రి, మహబూబ్‌ఖాన్, కె.సి.మస్తానయ్య, పి.డి.పి.సుమతి, సిబ్బంది, విద్యార్థినీవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిని సన్మానం



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా 2024 రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా మన జిల్లా నుండి ఎంపికైన పొదలకూరు బాలుర ఉన్నత పాఠశాల భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయుడు ఏవీ సుధాకర్‌ను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సన్మానించారు. విజ్ఞాన కార్యక్రమాల విజయాలలో సుధాకర్ కృషిని ప్రత్యేకంగా అభినందించారు. సుధాకర్ జాతీయస్థాయి అవార్డు కూడా త్వరలో అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పొదలకూరు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు తలచీరు మస్తాన్ బాబు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బోగోలు భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

## బెల్ షాపులు పై ప్రత్యేక దృష్టి పెట్టండి : డీఎస్పీ

**సీతారామపురం, మేజర్‌న్యూస్ :** మద్యం బెల్ట్ షాపులపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆత్మకూరు డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. శుక్రవారం సీతారాం పురంలోని పోలీస్ స్టేషన్‌కు విచ్చేసిన డీఎస్పీ శ్రీధర్ మండలంలోని సమ స్యలను ఎస్ఐ కృష్ణారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి అంతా సంతృప్తిగా ఉన్నాయని చెప్పారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. మండలంలోని బెల్ షాపులు, మత్తు పదార్థాలు, ఇసుక స్మగ్లింగ్, యూటీజింగ్ పై ప్రత్యేక దృష్టి సాధించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఉదయగిరి సీఐ వెంకటరమణ, సీతారాం పురం ఎస్ఐ శివకృష్ణారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్

## పేద ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం కొండంత భరోసా : ఎమ్మెల్యే ఇంటూరి

**కందుకూరు, మేజర్‌న్యూస్ :** నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సిఎంఆర్ఎఫ్ చెక్కులను, లెటర్ ఆఫ్ క్రెడిట్‌లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు పంపిణీ చేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం కొండంత భరోసానిస్తోందన్నారు. పేదల ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజల వెన్నంటి ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం గురించి ఆలోచించే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కలకాలం ముఖ్యమంత్రిగా ఉండాలని ఆయనకు ప్రజల ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలన్నారు. కందుకూరు నియోజకవర్గం ప్రజల తరఫున ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. కందుకూరు నియోజకవర్గంలో త్వరలో మరిన్ని ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సీఎం ఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేయటం జరుగుతుందని ఎమ్మెల్యే చెప్పారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు చెక్కులను మంజూరు



చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు పొడపాటి మహేష్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం మోపినట్లు కావలి డీఎస్పీ శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించి సంబంధిత రికార్డులు తనిఖీ చేసి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ.. గంజాయి విక్రయించినా. సేవంచినా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. గంజాయి విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. గంజాయి వల్ల యువత తమ జీవితాలను నాశనం చేసుకొంటున్నారన్నారు. మత్తు పదార్థాలు తీసుకోవడం వలన కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన సదస్సులు సైతం నిర్వహిస్తున్నామన్నారు. తల్లిదండ్రుల సైతం తమ పిల్లలపై నిమా ఉంచాలన్నారు. గంజాయి విక్రయాలపై పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎన్.వెంకట్రావు, ఎస్ఐలు కర్నాటి ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాసులు, ఆదిలక్ష్మి, రఘునాథ్, శివకృష్ణారెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆనకట్ట సుందరీకరణ పనుల పరిశీలన



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** రూ.9 కోట్లతో జరుగుతున్న ఉదయగిరి ఆనకట్ట సుందరీకరణ పనులను శుక్రవారం ఆత్మకూరు జలవనరుల శాఖ ఈఈ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆనకట్టకు జరుగుతున్న రివిట్మెంట్, కాంక్రీట్ పనులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ.. సుందరీకరణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడంతోపాటు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులు, గుత్తేదారుకు సూచించారు. పట్టణం నుంచి వచ్చే మురుగు నీరు బయటకు పంపేందుకు చర్యలు తీసుకొంటున్నామన్నారు. ఆనకట్ట సుందరీకరణ పనులు పూర్తయితే పట్టణ ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఈఈ కందుకూరి చంద్రమౌళి, గుత్తేదారు అక్కి భాస్కర్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆయుష్ శాఖ వారి ఆధ్వర్యంలో ఆయుర్వేద శిబిరం



**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలం చెంచులక్ష్మీపురం గ్రామంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వారి ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. కావలి సబ్ డివిజన్‌లోని ఆయుర్వేద వైద్యులు ఈ శిబిరంలో పాల్గొన్నారు. సీజనల్ వ్యాధులు అధికంగా ఉండడంతో దేశ్ కా ప్రకృతి పరీక్షాన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా చెంచులక్ష్మీపురం గ్రామ ప్రజలకు వైద్య సేవలు అందించామని ఆయుర్వేద వైద్యురాలు విజయ్ కుమారి తెలిపారు. ఎక్కువ శాతం రోగులు కీళ్లవాతం నొప్పులు, చికెన్ గున్యా జ్వరాలు ఉన్నాయని తెలిపారు. ఈసీబిరంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ శాఖ అధికారులతో ఎమ్మెల్యే ఇంటూరి భేటీ



**కందుకూరు, మేజర్‌న్యూస్ :** కందుకూరు నియోజకవర్గంలోని 5 మండలాల వ్యవసాయ అధికారులతో శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అధికారులతో రైతులకు ఎరువులు సకాలంలో అందించాలని, వ్యాపారస్తులు ఎరువులను ఎమ్మార్పీ ధరకు మాత్రమే విక్రయించాలని, ఎక్కువ ధరలకు విక్రయించకుండా కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ఆర్‌బీకే కేంద్రాల్లో రైతులకు సరిపడా ఎరువులు నిల్వ ఉంచాలని అధికారులను ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడి అనసూయ, మండల వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్

**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండలంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ కింద శుక్రవారం హౌస్ ఓల్డ్ సర్వేకి సంబంధించి సైదాపురం మండలంలో 16,150 హౌస్ ఓల్డ్ గాను దాదాపు 15,572 పూర్తి చేసామని, ఇవి 92శాతం పూర్తి అయిందని, మిగతా బ్యాలెన్స్ పూర్తి చేస్తున్నామని బ్యాంకు అకౌంట్లకు ఆధార్ లింకు సంబంధించి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. హౌస్ ఓల్డ్‌కు సంబంధించి ఎన్‌పీసీఐ 92శాతం హౌస్ హెూల్డ్ సర్వేలో సైదాపురం మండలం జిల్లాలో 3వ స్థానంలో ఉంది. ఎన్‌పీసీఐలో కూడా సైదాపురం మండలం 5వ స్థానంలో ఉందని సైదాపురం మండలం ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ తెలిపారు.

## చిన్నారులకు స్వీట్లు పంపిణీ



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని బిజ్జంపల్లె బీసీకాలనీ ఉర్దూ ప్రాథమిక పాఠశాల్లో విద్యార్థులకు శుక్రవారం అవాజ్ కమిటి ఆధ్వర్యంలో కమిటి సభ్యులు స్వీట్లు, బిస్కెట్లు, పెన్నులు పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆవాజ్ కమిటి నాయకులు నాయబ్ రసూలా బాషా, రజాక్ అన్వర్లు మాట్లాడుతూ.. ఆవాజ్ కమిటి 22సంవత్సరాలు పూర్తి చేసుకుని 23వ సవంత్సరంలో అడుగుపెట్టిన సందర్భంగా సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. మైనార్టీ డెవలప్మెంట్ ఫోరం 22 ఏళ్లుగా మైనార్టీల 20 సమస్యలపై పోరాడుతుందన్నారు. మౌజాన్, ఇమామ్ లకు ప్రభుత్వం జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో స్థానికఇమామ్,మౌజాన్లు పాల్గొన్నారు.

## 22 మంది ఉద్యోగాలకు ఎంపిక



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాలలో 54 మంది నిరుద్యోగ యువతీ, యువకులు పాల్గొనగా 22 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.నారాయణ స్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ జాబ్‌మేళాకు వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొని యువతకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేసుకోవడం జరిగిందన్నారు. మారుమూల ప్రాంతమైన ఉదయగిరిలో ఇలాంటి జాబ్మేళాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆకుల నరసింహులు, స్కిల్ డెలవప్మె 0ట్ అధికారి అబ్దుల్ బయ్యూం, ప్లేస్మెంట్ అధికారి జనార్దన్, స్కిల్ హబ్ కోఆర్డినేటర్లు ఆక్మల్, విశ్వరూపాచారి తదితరులు పాల్గొన్నారు.

## ట్రిప్పర్‌కు నిప్పు పెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** బుచ్చిరెడ్డిపాలెం మండలంలోని పంచేడులో వైసీపీ పార్టీకి చెందిన ప్రసాద్‌రెడ్డి అనే నాయకుడి టిప్పర్‌ను, ట్రాక్టర్‌ను తగలబెట్టిన ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఓ వృద్ధ దంపతుల పొలం విషయంలో తమ బంధువులకు అండగా నిలబడ్డాడని అదే గ్రామానికి చెందిన వ్యక్తులు ఓ ప్రముఖ రాజకీయ నాయకుని అండదండలతో తగలబెట్టారని ప్రజలు మాట్లాడుకుంటున్నారు. న్యాయం వైపు నిలబడితే ఎటువంటి చర్యలకు పాల్పడడం సిగ్గుచేటని ప్రతిపక్ష నాయకులు ఆరోపిస్తున్నారు. వ్యక్తిగత కక్షలు పెట్టుకొని ఇలా ఇతరులకు నష్టం కలిగించడం సరికాదని మండిపడుతున్నారు. ఎవరైతే ప్రసాద్‌రెడ్డి బండ్లను తగలబెట్టారు వారిపై చర్యలు తీసుకోవాలని నాయకులు కోరుతున్నారు.

## బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలి

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** అంగన్వాడీ కార్యకర్తలు గ్రామాల్లో బాల్య వివాహాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూపర్వైజర్ షాను పేర్కొన్నారు. ఆమె శుక్రవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉదయగిరి-2, తోపాటు దుత్తలూరు, నర్రవాడ సెక్టార్ల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కార్యకర్తలు గ్రామాల్లో బాల్యవివాహాలు నిర్మూలన, అనర్థాలపై కిషోరబాలికలకు అవగాహన కల్పించాలన్నారు. సమయపాలన పాటిస్తూ కేంద్రాలను నిర్వహించాలన్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలన్నారు. కార్యకర్తలు, ఆయాలు ఉదయం 9నుండి సాయంత్రం 4గంటల వరకు కేంద్రాల్లో అందుబాటులో వుండాల న్నారు. నెలసరి నివేదికలు సకాలంలో ఇవ్వాలన్నారు. బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు.

# సభ్యత్వంలో ఆత్మకూరును ప్రధమస్థానంలో నిలపాలి : మంత్రి ఆనం





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదులో ఆత్మకూరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ప్రధమస్థానంలో నిలపాలని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కోరారు. ఆనం రామనారాయణరెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఆత్మకూరు మున్సిపాలిటీ, ఆత్మకూరు, అనంతసాగరం, ఏఎస్‌పేట, సంగం, చేజర్ల, మర్రిపాడు మండలాల్లో ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు టిడిపి సభ్యత్వనమోదును ముమ్మరంగా చేస్తూ ఇప్పటికే ఈనియోజకవర్గం రాష్ట్రంలో ఐదవస్థానంలో ఉన్న విషయం విధితమే. శుక్రవారం మంత్రి రామనారాయణరెడ్డి ఆత్మకూరు మున్సిపల్ టిడిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, ముఖ్య కార్యకర్తలతో సభ్యత్వ నమోదు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి రామనారాయణరెడ్డి ప్రసంగిస్తూ తెలుగుదేశం సభ్యత్వం స్వీకరించడం ప్రయోజనకరమని, అందరూ స్వచ్ఛందంగా సభ్యత్వం స్వీకరించేలా కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని కోరారు. తాను, తన కుటుంబ సభ్యులం టిడిపి శాశ్వతసభ్యత్వం పొందామన్నారు. నియోజకవర్గంలోని ప్రతి తెలుగుదేశం కార్యకర్త టిడిపి సభ్యత్వం స్వీకరించేలా నాయకులు కృషి చేయాలన్నారు. సభ్యత్వం స్వీకరించేవారికి తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అండగా ఉంటారని ఆనం పేర్కొన్నారు. కార్యకర్తలకు అండగా నిలుస్తున్న, ఆకుటుంబానికి భరోసా కల్పిస్తున్న టిడిపిలో సభ్యులుగా చేరడం మంచి అవకాశామని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు. రాష్ట్రవ్యాప్తంగా సభ్యత్వ నమోదు ప్రక్రియ వేగవంతంగా జరుగుతుందని, ఆత్మకూరు నియోజకవర్గం నెల్లూరు పార్లమెంటు పరిధిలోని 7నియోజకవర్గాల్లో ప్రధమస్థానంలో ఉందని, రాష్ట్రంలో ఐదవస్థానంలో ఉందని ఆయన పేర్కొంటూ ప్రతి పోలింగ్‌కేంద్రంలో టిడిపికి పోలైన ఓట్లలో 60శాతం మందిని సభ్యులుగా చేర్చాలని, నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ప్రధమస్థానంలో నిలిపేలా కృషి చేయాలని ఆయన కోరారు. అందుకుగాను తెలుగుదేశం ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు ప్రత్యేకశ్రద్ధతో కృషిచేయాలని రామనారాయణరెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పరిశీలకులు బుల్లెట్‌రమణ, సుఖవాసి శ్రీనివాస్, ఆత్మకూరు పట్టణ టిడిపి అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, రాష్ట్ర తెలుగుమహిళ కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, రాష్ట్ర తెలుగుదేశం కార్యదర్శి దావా పెంచలరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, వైస్‌చైర్మెన్ షేక్ సర్దార్, కౌన్సిలర్లు చెరుకూరు శ్రీనివాసులునాయుడు, షేక్ గౌస్‌బాషా, కొప్పోలు రమాదేవి, గంధళ్ళ వేణు, సూరా భాస్కరరెడ్డి, టిడిపి నాయకులు పల్లవోలు జయాకర్, గొట్టిగుండాల బుజ్జిరెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, దోర్నాదుల సురేష్‌బాబు, షేక్ రేష్మా, రబ్బాని, ఖాదర్‌మస్తాన్, గోరీషబ్బీర్, నలిశెట్టి శ్రీనయ్య, నలిశెట్టి రవికుమార్, డక్కా మల్లికార్జున, బొగ్గవరపు శ్రీకాంత్‌నారాయణ, చిట్టమూరు వెంకటేశ్వర్లురెడ్డి, దాసరి మధుసూధనరావు, దాసరి బాలకృష్ణ, పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నక్కలకాలనీ సమగ్ర అభివృద్ధికి చర్యలు

- అర్థంతరంగా ఆగిపోయిన ఇళ్లనూ పూర్తి చేయిస్తాం
- ఐటీడీఏ సహకారంతో ఆర్టిఫిషియల్ ఫ్లవర్స్ తయారీకి రుణాలు
- కమ్యూనిటీ హాలుతో పాటు పేదలకు స్థలాలు, ఇళ్ల నిర్మాణం
- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** వెంకటాచలం మండలం చెముడుగుంట పంచాయతీ పరిధిలోని నక్కలకాలనీలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి అన్ని శాఖల అధికారులతో కలిసి కాలనీలో పర్యటించి ప్రజా సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భగా ఎమ్మెల్యే సోమిరెడ్డి మాట్లాడుతూ.. 1983లో నందమూరి తారక రామారావు ప్రభుత్వ హయాంలో నక్కలకాలనీలో ఒక్కో కుటుంబానికి 33 అంకణాల స్థలం ఇచ్చారని, పెరిగిన జనాభాకు అనుగుణంగా ఇప్పుడు ఇళ్లు లేని వారికి స్థలాలు మంజూరు చేయడంతో పాటు పక్కా గృహాలు కట్టిస్తామన్నారు. అర్థంతరంగా ఆగిపోయిన పక్కా గృహాల నిర్మాణాలను పూర్తి చేయిస్తామని, నక్కలకాలనీలోనే కమ్యూనిటీ హాలు నిర్మాణం చేపడతామని, ఆర్టిఫిషియల్ ఫ్లవర్స్ తయారీలో అనుభవం కలిగిన స్థానికులకు ఐటీడీఏ సహకారంతో రుణాలు మంజూరు చేయిస్తామన్నారు. ప్రతి ఒక్కరికీ ఆధార్ కార్డు ఉండేలా చూడటంతో పాటు అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా అధికారుల సహకారంతో కృషి చేస్తామని, ప్రతి గ్రామ పర్యటన సందర్భంగా గిరిజన కాలనీలను అధికారులతో కలిసి సందర్శించి వారి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెడతామని, గ్రామాల్లోని నాయకులు, కార్యకర్తలతో పాటు విద్యావంతులు కూడా గిరిజనుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టి వారిలో చైతన్యం తెచ్చేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

# పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండలం చౌటభీమవరం గ్రామ సచివాలయంలో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్‌లపై అదే సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దేవకుమార్ ఎంపీడీవో ప్రసన్న కుమారికు లిఖితపూర్వకంగా శుక్రవారం ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శి డిజిటల్ అసిస్టెంట్‌లు కలసి తనకు ఈనెల జీతం రాకుండా చేయడానికి బిల్లు ప్రభుత్వానికి పంపలేదని ఫిర్యాదుల పేర్కొన్నారు. అందుకు దేవకుమార్ కారణం చెప్పమని పంచాయతీ కార్యదర్శిని అడిగితే నిర్లక్ష్యపు సమాధానం చెప్పారని ఆందోళన వ్యక్తం చేశాడు. నెలరోజుల పాటు పనిచేసి వచ్చే జీతంతో కుటుంబాన్ని పోషించాల్సి ఉంటుందని. ఉద్దేశపూర్వకంగానే పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్ కలిసి తనకు మానసిక క్షోభకు గురిచేసి కించపరిచి మాట్లాడి. ఇబ్బందులకు గురి చేస్తున్నారని దేవకుమార్ ఆరోపించాడు. నువ్వు ఏం చేస్తావ్ చేసుకో నీ ఇష్టం వచ్చినచోట చెప్పుకో అని డిజిటల్ అసిస్టెంట్ ఇష్టప్రకారం మాట్లాడాడని దీని పై ఉన్నత అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరుతూ ఎంపీడీవోకు లిఖితపూర్వక ఫిర్యాదు చేయడం జరిగిందన్నాడు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎంపీడీవో విచారించి న్యాయం చేస్తానని తెలిపారు.

## సూర్య మేజర్ న్యూస్‌కు స్పందన

# ఆక్రమణలు సర్వే చేసిన మండల అధికారులు

- ఎమ్మెల్యే వేమిరెడ్డికి రైతుల అభినందన వెల్లువ



**కొడవలూరు, మేజర్‌న్యూస్ :** కొడవలూరు మండలం నార్త్ రాజుపాలెం గ్రామంలో 13వ తేదీ నవంబర్ నెల 2024వ సంవత్సరం **సూర్య దినపత్రికలో** ప్రచురించిన 'కాలువలపై ఉన్న ఆక్రమణలు వెంటనే తొలగించండి' అనే శీర్షిక ప్రచురించటం జరిగిందని, ఆ శీర్షికకు స్పందించిన వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి నేడు నీటిపారుదల శాఖ వారు రెవెన్యూ డిపార్ట్మెంట్ వారు కాలువలపై ఉన్న ఆక్రమణలు సర్వే నిర్వహించి గుర్తులు పెట్టి వెళ్లారని, ఈ ఆక్రమణలను అతి త్వరలో తొలగించి ఆక్రమణలకు గురికాకుండా చూడాలని పూడిపోయిన కాలువలను సైతం సొంత నిధులతో తీయించిన వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని, రైతులు గ్రామ ప్రజలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మందిపాటి రమణారెడ్డి, ఇరువురు యోగానందరెడ్డి, బత్తిన రాఘవరెడ్డి, వేమిరెడ్డి శేషురెడ్డి, బత్తిన బాబు రెడ్డి, గంగపట్నం జనార్దన్ రెడ్డి, పోసింరెడ్డి దిలీప్ కుమార్ రెడ్డి, దయాకర్, పొన్నూరు చంద్ర, దొడ్ల సురేందర్ రెడ్డి, తిరకాల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# మూలవర్లకు అభిషేకం, తిరుప్పావడ సేవ



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలం నరసింహకొండ పై వేంచేసియున్న వేదగిరి లక్ష్మి నరసింహస్వామి వారి దేవస్థానంలో శుక్రవారం స్వామి వారి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రం సందర్బంగా మూలవర్లకు అభిషేకం, తిరుప్పావడ సేవ, శుక్రవారం సందర్బంగా ఆదిలక్ష్మి అమ్మవారికి అభిషేకం కార్యక్రమాలు వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య వైభవంగా జరిగాయి. భక్తులు అదిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని అమ్మవారిని దర్శించుకుని తీర్ధ ప్రసాదములు స్వీకరించారు. ఈ కార్యక్రమాలును ఆలయ కార్యనిర్వహణాధికారి వేమూరి గోపి స్వయంగా పాల్గొని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమాలులో రూప్ కుమార్ యాదవ్ కుటుంభ సభ్యులు, యాలమూరి రంగయ్య నాయుడు మిత్ర బృందం, అళహరి విజయ్ తదితరులు, అర్చక సిబ్బంది, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

# మూలస్థానేశ్వరునికి పుష్పాభిషేకం



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** కార్తీకమాసం పురస్కరించుకుని నెల్లూరు శ్రీ మూలస్థానేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం స్వామి వారికి పుష్పాభిషేకం నిర్వహించారు. ఈ వేడుక చూడడానికి భక్తులు బారులు తీరారు. స్వామి వారి పుష్పాభిషేకం చూస్తూ భక్తులు పరవసించిపోయారు. పలు రకముల పూలతో స్వామి వారికి అర్చకులు అభిషేకము నిర్వహించారు. పుష్పాభిషేకం అనంతరం భక్తులకు తీర్ధ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంకు ఉభయకర్తలుగా పోలుబోయిన రమణయ్య జ్ఞాపకార్థం కోటమ్మ, కుమారులు పోలుబొయిన రూపుకుమార్ యాదవ్, దయాకర్, స్రవంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంకు ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి జె.శ్రీనివాసరావు పాల్గొన్నారు. మాస శివరాత్రి సందర్భంగా స్వామి అమ్మవార్లకు చిన్న రథ ప్రాకారోత్సవం ఘనంగా నిర్వహించారు.